గలగలల గోల

ఇది సిద్ధం పెదబాబు కథ

సిరిమువ్వ గజ్జెలు బాగుంటాయి. అందులోనూ పండిన తమల పాకులాంటి అమ్మాయిల పాదాలకు వెండి గజ్జెలు బాగుంటాయ్. బంగారు పట్టీలు బాగుంటాయి. ఘల్లు ఘల్లుమని తిరిగే ఆ పాదాలు నట్టింట్లో నడిస్తే గలగలా గోదారి ప్రవహిస్తుంది. అవే పాదాలు గోల గోల మని ఓ ఆఫీసులో తిరిగితే ఏమైందో తెలిపే సరదా... కథ...

అది పేరు మోసిన ఒక పెద్ద కెమికల్స్ కంపెనీ. పేరైతే మోస్తోందిగానీ దాని వెనుక పెద్ద మొత్తంలో నష్టాన్ని కూడా మోస్తోంది. దాని వెనుక పెద్ద మొత్తంలో నష్టాన్ని కూడా మోస్తోంది దాని డ్రైఫీసు ఆ పట్టణం నడి బొడ్డులో దుర్గాదేవి రోడ్డులో ఉంది. అందులో మేనేజర్లూ, ఆఫీసర్లూ, అసిస్టెంట్లూ, జూనియర్ స్టాఫూ మొత్తంకలసి దాదాపు నూటా యాభైమంది పనిచేస్తున్నారు. అన్ని హంగులూ ఉన్న ఆ కంపెనీ మేనేజ్‌మెంట్ అతిరథులూ, మహారథులూ శాయశక్తులా ఆ నష్టాన్ని పూడ్చేందుకు కృషి చేస్తూనే ఉన్నారు పాపం! ఆ ఆఫీసులో ఉద్యోగులంతా మగవారే తప్ప ఆడవారు లేకపోవటం ఓ ప్రత్యేకత.

ఒకరోజు అలా దారిన పోతోన్న కొండదేవర కోయదొరకన్ను ఆ ఆఫీసు మీద పడింది. పడటమే తరువాయి ఆఫీసులోకి అడుగు పెట్టి తిన్నగా తలుపు తీసుకొని ఎం.డి. రూంలోకి చొరబడ్డాడు. అప్పుడే భోజనం ముగించుకొని భుక్తాయాసం తీర్చుకొంటోన్న ఎం.డి. ఆ కోయ దొరను కూర్చో బెట్టి జాతకం చెప్పమన్నాడు. ఎం.డి. చేతిని అందుకొని, ఎముకలు ఏరిగిపోయేలా అష్ట వంకర్లు తిప్పి, ఎక్కడలేని గజిబిజి రేఖలను చూపించి, ఏవేవో పనికిమాలిన కబుర్లు చెప్పి, ఏదో మురిగిపోయిన మూలికొకటి కట్టి పెద్ద మొత్తంలో రాబట్టుకొని బయటకు నడిచాడు కోయదొర.

అయితే కొండ దేవర చెప్పిన లక్షా తొంబై విషయాల్లో, ఎం.డి.ని అత్యంతంగా ఆకట్టుకున్నవి రెండేరెండు విషయాలు. అది ఉన్న ఆఫీసు అడ్రస్ అన్ని నష్టాలకూ

మూలమట తిరుపతి గుండుకు నామాలు పెట్టినట్లు నూటపదకొండు అంకె ఆ కంపెనీకి అచ్చిరాలేదట. ఇకపోతే రెండో విషయం – అమ్మాయిల గజ్జెల సవ్వడి ఆ ఆఫీసులో వినిపిస్తోంటే తప్ప లక్ష్మీదేవి తాండ వించదట. అమ్మాయిలను ఆఫీసులో చేర్చుకోవటం ఎంతో ముఖ్యమనీ, అప్పుడే సిరి దానంతట అది నడచి వచ్చి కంపెనీకి లాభాలు చేకూర్చగలదట. అందుకే వారం రోజులు తిరగ కుండానే టైపిస్టులూ స్టెనో గ్రాఫర్లూ, అసిస్టెంట్లూ, రిసెప్షనిష్టులకోసం ఇంటర్వ్యూలు పిలిచారు.

ఇంటర్వ్యూకి పదిహేను మందికి పైగా హాజరయ్యారు. కొంతమంది ఫ్రాకులు, మరికొంతమంది చీరెలూ ఇద్దరు ముగ్గురు పంజాబీ డ్రస్సులు వేసుకొని, ఒకరిద్దరు మోడ్రన్ డ్రస్సులు వేసుకొని సీతాకోక చిలకల్లా సింగారించుకొని ఉన్నారు. వారందరినీ ఒకేసారి ఇంటర్వ్యూ గదిలోకి పిలిపించి వరుసగా కుర్చీల్లో కూర్చో మన్నాడు అమ్మాయిలంతా వయ్యారాలు ఒలకబోస్తూ వెళ్ళి కుర్చీల్లో కూర్చున్నారు.

అయితే లోపల అర్బాటంగా అయిదారుగురు ఇంటర్వ్యూ చేసేవాళ్ళెవరూ లేరు. కేవలం ఇద్దరు మేనేజర్లు మాత్రం ఉన్నారు. ద్వైపాక్షిక సిద్ధాంతాలూ, డబుల్ ఎంట్రీబుక్ కీపింగుల గురించీ సబ్జక్టుకు సంబంధించిన వ్యవహారాలేమీ అడుగలేదు.

మలేషియా రాజధాని ఏది ?, ఆస్ట్రేలియా జాతీయ పక్షి ఏది ? వంటి జనరల్ నాలెడ్జి ప్రశ్నలు వేయలేదు. అలాగని శ్రీదేవి ఎన్ని సినిమాల్లో నటించింది ?, అజారుద్దీన్ ఎన్ని సెంచరీలు కొట్టాడు ? అనే అవేర్‌నెస్ ప్రశ్నలు వేసి వేధించలేదు. ఇంటర్వ్యూలో వాళ్ళడిగింది ఒకటే విషయం – మడమల పై వరకూ వారి వారి డ్రస్సులు ఎత్తి కాళ్ళు చూపించాలి కొంతమంది 'ఆశ్చర్యపోతూ, మరికొంతమంది అనుమానంతోనూ, ఇంకొంతమంది భయం తోనూ, మిగిలినవారు బిడియంతోనూ, సిగ్గుతోనూ మొత్తానికి అందరూ తమ తమ కాళ్ళను మడమల వరకూ చూపించారు.

అంతే! అందులోంచి టకాలున నలుగురినీ ఏరి, తతిమా వాళ్ళందరికీ సెలక్టురాలేదు వెళ్ళిపొమ్మన్నారు. ఆ నలుగురికీ ఎందుకు ఉద్యోగం వచ్చిందో, తతిమా వారికెందుకు రాలేదో ఎవ్వరికీ అంతు చిక్కలేదు వారంరోజుల తర్వాత అందరికీ తెలిసిన రహస్యం ఏమిటంటే – కొండదేవర చెప్పిన మాటలు అక్షరాలా పాటించేందుకు కాళ్ళకు గజ్జెలుకట్టిన అమ్మాయిలను మాత్రమే ఎంపిక చేశారట.

మరుసటి రోజునుంచీ ఆఫీసు అమ్మాయిలతో నిండిపోయింది. 'ఏచెట్టూలేని చోట ఆముదం చెట్టే మహావృక్షమన్నట్లు. ఎడారిలాంటి ఆఫీసులోకి ఒయాసిస్సుల్లాంటి అందమైన అమ్మాయిలు చేరేసరికి ఆఫీసు పద్ధతులే మారిపోయాయి. మేనేజర్లనుండీ ఆఫీసు ఫ్యూన్ వరకూ అందరూ మరింత ట్రిమ్‌గా తయారై వేళకంటే ముందుగానే ఆఫీసుకి హాజరయ్యేవారు. ఇలా ఉన్నట్లుండి అటెండెన్సు రేటు పెరిగేసరికి ఒక్కసారిగా ఎం.డి.కి గుండాగినంత పనయ్యింది. ఇదంతా కోయదొర మహిమేనని తెగ మురిసిపోయాడు అదే కోయదొర మళ్ళీ కనిపిస్తే, ఘనంగా సత్కారం చేయాలని కూడా నిర్ణయించుకున్నాడు.

ఆఫీసంతా నూతనోత్సాహం పెల్లుబుకింది. ఘల్లుమనే గజ్జెల చప్పుడుతో నిండిపోయింది. అక్కడి ఉద్యోగుల గుండెలను రుల్లుమనిపించింది.

కాలం గిర్రున తిరిగింది. రోజులు వారాలై, వారాలు నెలలై ఏడాది గడిచేసరికి నాలుగుకోట్ల నష్టంతో నడిచిన కంపెనీ నలభై నష్టానికి చేరుకుంది. నలుగురమ్మాయిలూ చేసిన గజ్జెల చప్పుడు కారణంగా నలభైమంది ఉద్యోగులకీ మతిపోయిందనే విషయం చాలా ఆలస్యంగా తెలుసుకుంది. హయ్యర్ మేనేజ్‌మెంట్ ఆ తర్వాత జుట్టు పీక్కొని, గుడ్డలు చించుకొని, క్రిందపడి దొర్లి, ఇనుకు మీదేసుకొని, గుక్కపెట్టి ఏడ్చినా ప్రయోజనం లేకపోయింది పాపం! ఛ్ఛ!

వస్త్రపు జుట్లు